క్లుప్తంగా

విధులకు సకాలంలో హాజరుకండి



తెనాలిఅర్బన్: విధులకు సకాలంలో హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పాత ప్రభుత్వ వైద్యశాలలోని మూడవ పారిశుద్ధ్య డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం తెల్లవారుజామున ఆయన తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఎవరూ విధులకు గైర్హాజరు కావద్దని సూచించారు. పట్టణంలో ఎక్కడా పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఉన్నారు

కవెవరంలో నీరు తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

తెనాలిరూరల్: మండలం కవెవరం గ్రామంలో అయ్యప్పపురం ప్రాంతం జలదిగ్బంధంలో ఉండడంపై ఈ నెల 9వ తేదీన 'సాక్షి'లో వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. ఇంటన్లు, మోటార్లతో ఈ ప్రాంతంలో నీటిని అధికారులు తొలగిస్తున్నారు. ప్రజలు ఇబ్బందిపడకుండ చర్యలు తీసుకుంటున్నట్టు గ్రామ సర్పంచ్ బండికళ్ల ప్రసాద్ తెలిపారు. మంత్రి మనోహర్ ఓఎస్‌డీ ఏసురత్నం పనులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.

దళితులపై దాడులు అరికట్టాలి



తెనాలిఅర్బన్: రాష్ట్రంలో దళితులపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ డిమాండ్ చేశారు. తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న మున్నంగి గ్రామానికి చెందిన దళిత మహిళ బొంతు శిరీషను మంగళవారం ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కూచిపూడి కిరణ్, ఉన్నం భరత్, ఉన్నం ఇమ్మానియేల్, కారుమూరి చంటి, ఉన్నం గోపి, ఉన్నం సన్నీ, ఉన్నం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేళాంగిణి మాత జన్మదినోత్సవం



తెనాలిరూరల్: వేళాంగిణి మాత జన్మ దినోత్సవాలను మండలంలోని అంగలకుదురులో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి వద్ద పేదలకు బియ్యం, కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. చర్చి గురువులు శౌరిరాజు, మెరియో, సునీల్, ఉపదేశకులు పి. బాలస్వామి, రాజమోహన్, సీహెచ్ బాలస్వామి, జ్ఞానమేరి, సంఘపెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



తెనాలిరూరల్: శాసనమండలి ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ కేవీ గోపాలకృష్ణ మంగళవారం పరిశీలించారు. స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, గంగానమ్మపేటలోని తోటకూర సుబ్బారావు నాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, వెంటిలేషన్ వంటి సదుపాయాలను పాఠశాల ఉపాధ్యాయ బృందం ద్వారా తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్‌ఐ వి. జాన్, సీనియర్ అసిస్టెంట్ ఎస్. జగన్‌మోహన్‌రావు సిబ్బంది ఉన్నారు.

కోర్ సెక్టార్‌లో ఉద్యోగావకాశాలు

మోతడక(తాడికొండ): సాఫ్ట్‌వేర్‌తో పాటు కోర్ సెక్టార్‌లో అద్భుత ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలని విశిష్ట ఇన్నోవేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.సందీప్ చెప్పారు. మంగళవారం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఐఈటీఈ స్టూడెంట్ ఫోరం ఆధ్వర్యంలో పీసీబీ డిజైన్ అండ్ ఫ్యాబ్రికేషన్ అనే అంశంపై నాలుగు రోజుల వర్క్‌షాప్ ప్రారంభించారు.

సున్నం చల్లి... చెత్త ఎత్తివేసి...

- ముంపు గ్రామాల్లో చకచకా పారిశుద్ధ్య పనులు
- వ్యర్థాల తొలగింపు ముమ్మరం



లంక గ్రామంలో చెత్తను తొలగిస్తున్న కార్మికులు

కొల్లిపర: నిన్న మొన్నటి వరకు మండల పరిధిలోని లంక గ్రామాల్లో వరద ఉధృతి కారణంగా గ్రామంలో అనేక చోట్ల నీరు చేరటంతో చెట్ల, మట్టి, మురుగు పేరుకు పోవటంతో గత రెండు రోజుల నుంచి ఆయా గ్రామంలో వరదనీరు పూర్తిగా తగ్గటంతో ఎంపీడీవో వి.విజయలక్ష్మి వేగంగా పంచాయతీ కార్యదర్శుల ద్వారా పారిశుద్ధ్యంపై శ్రద్ధ పెట్టారు. పాత బొమ్మువానిపాలెం, అన్నవరపులంక, కొత్తూరు లంక గ్రామాలలో బ్లీచింగ్, నీరు నిల్వ ఉన్న చోట ఆయల్, దోమలకు మందులు పిచికారీ చేయించారు. వరద కారణంగా నిలిచిన చెట్ల, చెట్టుకొమ్మలు, వ్యర్థ పదార్థాలను తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడైనా చెట్ల, మురుగు ఉన్న పక్షంలో తమ దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



పాత బొమ్మువానిపాలెంలో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ కార్మికులు

చవితి వేడుకల్లో అన్నదానం



ఉత్సవాల్లో పాల్గొన్న డీఎస్పీ జనార్ధనరావు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

తెనాలిరూరల్, తెనాలిఅర్బన్: మండలం జగ్గడిగుంటపాలెం ప్రగఢకోటయ్య నగర్‌లో పద్మశాలి యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న 29వ గణేష్ మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన మంగళవారం రాత్రి నాలుగు వేల మందికి అన్నదానం చేశారు. డీఎస్పీ బి. జనార్ధనరావు ముఖ్య అతిథిగా పాల్గొని గణేష్ మందిరంలో పూజలు చేశారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా హిందూ ముస్లింలా ఆధ్వర్యంలో 33వ వార్డు మహేంద్ర కాలనీలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరునికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించండి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

తెనాలిఅర్బన్: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కొనియాడారు. బీసీ సంక్షేమ సంఘం తెనాలి పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని రజక చెరువు వద్ద ఉన్న ఐలమ్మ పార్కులో మంగళవారం నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు ఆమె పంచిందని గుర్తు చేశారు. ఆమె పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమన్నారు. ఆ స్ఫూర్తితో అందరూ పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కుర్రా శ్రీను మాట్లాడుతూ భూస్వామి వ్యవస్థపై తిరుగుబాటు చేసి వెనుకబడిన కులాలకు అండగా ఐలమ్మ ఉందని తెలిపారు. ఆమె అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ నాయకులు వేముల కృష్ణ, షేక్ మీరావలి, అన్నం గణపతి, పెసర్లంక రమణ, మునిపల్లి పార్వతి, మునిపల్లి వంశీ, తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శంకరరావు, శ్రీను

రైతులను ఆదుకోవాలి

తాడేపల్లిరూరల్: వరదలు, వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు కోరారు. మంగళవారం తాడేపల్లిలోని రైతు సంఘం కార్యాలయంలో దండమూడి సాంబశివరావు అధ్యక్షతన రైతు సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా శివశంకరరావు మాట్లాడుతూ వాణిజ్య ఉద్యానవన పంటలకు ఎకరాకు లక్ష రూపాయలు, వరి తదితర పంటలకు ఎకరాకు 30 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతుల రుణాలు మాఫీ చేయాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేల పెట్టుబడి సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు రైతు సమస్యలపై సెప్టెంబర్ 12 నుంచి 16 వరకు అన్ని సచివాలయాల్లో వినతి పత్రాలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాజధాని రైతు సంఘం అధ్యక్షులు కె.జగదీశ్వరరెడ్డి, బక్కిరెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎస్కే యర్రపీరు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకరరావు

విద్యార్థులకు పండ్లు, పుస్తకాలు పంపిణీ

తెనాలిఅర్బన్: పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో యడ్లలింగయ్య కాలనీలోని ఎస్‌కెసి ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం యాపిల్స్, బ్రెడ్, పుస్తకాలు, పెన్సిల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎస్.అరుణకుమారి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తాము చదివిన పాఠశాలలో సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.



కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంపీ పుష్ప, రాణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే రక్తహీనత నివారణ

ఫిరంగిపురం: గర్భిణులు పోషకాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత తొలగుతుందని వైద్యురాలు ఫరీనాబేగం చెప్పారు. నుదురుపాడు పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ యోజన ద్వారా తొమ్మిది గ్రామాల నుంచి వచ్చిన 39 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. ఫరీనాబేగం మాట్లాడుతూ గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. గర్భిణులకు రక్తహీనత నివారణ మాత్రలు అందిస్తున్నట్టు వివరించారు. ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పు జరిగేలా అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.



గల్లాలు కొట్టుకుపోతున్నారు

- రేపల్లెలో వరుస దొంగతనాలు
- తాళం వేసి ఉన్న దుకాణాలే లక్ష్యం
- పట్టించుకోని పోలీసులు
- కానరాని గస్తీలు
- వ్యాపారులు, ప్రజలు బెంబేలు

రేపల్లె రూరల్: రేపల్లెలో వరుస చోరీలు ప్రజలు, వ్యాపారులను బెంబేలెత్తిస్తున్నాయి. అయినా పోలీసులు పట్టించుకోవడం లేదు. ఎక్కడా గస్తీలు కానరావడం లేదు. ఫలితంగా దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసి ఉన్న దుకాణాలనే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. గల్లాపెట్టెలను కొట్టుకుపోతున్నారు. గత వారం రోజుల్లోనే ఆరుకుపైగా చోరీలు జరిగాయి. రేపల్లె పట్టణం ఓల్డ్‌టౌన్ నుంచి జగనన్న కాలనీ వరకు రోజూ ఏదో ఒక ప్రాంతంలో చోరీ జరుగుతూనే ఉంది. పెద్ద మసీదు సమీపంలో ఓ దుకాణంలో, నెహ్రూ బొమ్మ సెంటరులోని ఓ డ్రింక్ షాప్‌లో, బస్టాండ్ సెంటరులోని ఓ దుకాణంతో పాటు పలు దుకాణాలలో చోరీలు జరిగాయి. పెద్ద దుకాణాలలో అయితే ఒక్కో దుకాణంలో రూ.20వేల నుంచి రూ.40వేలు అపహరణకు గురైనట్టు తెలుస్తోంది.

ఫిర్యాదులకు వ్యాపారుల వెనుకడుగు

అయితే చోరీలపై ఫిర్యాదు చేసేందుకు వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నారు. కేసులు పెట్టడంతో తమ షాపులు వదిలి రోజుల తరబడి స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందని భయపడుతున్నారు. ఆరుకుపైగా చోరీలు జరిగినా ఒక్కరే ఫిర్యాదు చేయడం దీనికి నిదర్శనం. పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉండే ప్రాంతాల్లోనూ చోరీలు జరుగుతున్నా.. పోలీసులు పట్టించుకోకపోవడంపై ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



బస్టాండ్ సెంటరులో చోరీ జరిగిన దుకాణం



అగంతకులు పగులగొట్టిన దుకాణ తాళం

పోలీసు బలగం ఉన్నా..

డివిజన్ కేంద్రంగా రేపల్లె ఏర్పడిన తరువాత పట్టణంలో ఒక డీఎస్పీ, ఇద్దరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు, ఇద్దరు ఎస్ఐలు, ఇతర సిబ్బంది మొత్తం 50 మందికిపైగా పనిచేస్తున్నారు. కేవలం 5 కిలోమీటర్ల విస్తీర్ణం లోపు ఉండే పట్టణంలో ఇంతమంది ఉన్నా.. చోరీలు అరికట్టలేకపోవడం విస్మయం కలిగిస్తోంది.

కనీసం అవగాహన కార్యక్రమాల్లేవు

దొంగలను అరికట్టలేకపోయినా.. కనీసం ప్రజలను అప్రమత్తం చేసి చోరీలపై వ్యాపారులకు అవగాహన కల్పించే యత్నమూ పోలీసులు చేయడం లేదు. ప్రచార కార్యక్రమాలు చేపట్టడం లేదు.

ఫిర్యాదులు అందలేదు



పట్టణంలో చోరీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందలేదు. బస్టాండ్ సెంటరులోని ఓ దుకాణ యజమాని మాత్రమే చోరీ జరిగిందని ఫిర్యాదు ఇచ్చారు. పట్టణంలో నిత్యం గస్తీలు నిర్వహిస్తున్నాం. ఇంకా ముమ్మరం చేస్తాం. ప్రజలు అనుమానాస్పద వ్యక్తులపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలి. దుకాణాల్లోగానీ, ఇళ్లలోగానీ చోరీలు జరిగితే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

– మల్లికార్జునరావు, పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, రేపల్లె

మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ప్రయత్నించండి

తెనాలిఅర్బన్: మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు అందరూ ప్రయత్నించాలని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.శ్రావణ్‌బాబు సూచించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం విభాగం ఆధ్వర్యంలో జె.ఎం.జె. కళాశాలలో మంగళవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్కర సమయంలో యువత భావోద్వేగానికి గురికావద్దన్నారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు ఇబ్బందులు గురిచేస్తాయని చెప్పారు. మానసిక స్థైర్యాన్ని అందరూ కలిగి ఉండాలన్నారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆత్మహత్యలు పేరేపించే అంశాలు, వారి ప్రవర్తనను విజ్ఞాన్ లారా యూనివర్శిటీ సైకాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ మండల్ తెలియజేశారు. కార్యక్రమంలో గిరిధర్, డాక్టర్ పి.హేమలత, కె.శ్రావణి, చిన్న బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి.శ్రావణ్‌బాబు

డాక్టర్ అంబేడ్కర్ జీవితం ఆదర్శప్రాయం



గుంటూరు వెస్ట్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆధునిక భారతావని చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయమని టీడీపీ రాష్ట్ర నాయకుడు, దళిత ఉద్యమకారుడు కొర్రపాటి సురేష్ పేర్కొన్నారు. సురేష్ రచించిన అంబేడ్కరిజం (అంబేడ్కర్ జన జాగృతి గీతాలు) పుస్తకాన్ని వేమూరు శాసన సభ్యుడు నక్కా ఆనంద్‌బాబుకు మంగళవారం స్థానిక కార్యాలయంలో అంకితమిచ్చారు. సురేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి దళిత ఉద్యమాలతోపాటు సామాజిక ఉద్యమాల్లో పనిచేసిన నక్కా ఆనంద్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని తాను రచించిన పుస్తకాన్ని అంకితమిచ్చామన్నారు.

స్టీల్ ప్లాంట్ పరిరక్షణలో ప్రభుత్వం విఫలం

బాపట్లటౌన్: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.మజుందార్ విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలని కోరుతూ మంగళవారం బాపట్లలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మజుందార్ మాట్లాడుతూ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన చంద్రబాబు ప్రభుత్వం మోదీ ప్రభుత్వ అడుగులకు మడుగులొత్తుతోందని ధ్వజమెత్తారు. జనసేన పార్టీ కూడా స్టీల్‌ప్లాంట్‌పై నోరుమెదపకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.శరత్ ,బుచ్చిరాజు, బ్రహ్మం, బాష, వీరారెడ్డి పాల్గొన్నారు.



పాతబస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

వరిలో సస్యరక్షణ అవసరం

కొల్లూరు/భట్టిప్రోలు: వర్షాల వల్ల ముంపునకు గురైన వరి పంటను కాపాడుకోవడానికి రైతులు సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తల బృంద సభ్యులు అన్నే మృదుల, ఎస్.కామక్షి, ఎం.ఉష అన్నారు. మంగళవారం చినపులివర్రులో వర్షపు నీటిలో మునిగి ఉన్న వరి పంటలను పరిశీలించారు. పంటల రక్షణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. భట్టిప్రోలులో నీట మునిగిన వరి పంటలను బాపట్ల వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం మంగళవారం పరిశీలించింది. ఈ బృందంలో ఉప్పునీటి పరిశోధన, వ్యవసాయ పరిశోధన, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అన్నె మృదుల, ఎస్.కామాక్షి, ఎం.ఉషలు ఉన్నారు. రైతులకు పలు సూచనలు ఇచ్చారు.



రైతులను ఆదుకోవాలి

భట్టిప్రోలు: కృష్ణానది వరదల వల్ల లంక గ్రామాల్లో వాణిజ్య పంటలను కోల్పోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు జి.బాలాజీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వరద ముంపునకు గురై దెబ్బతిన్న పంటలను మంగళవారం సీపీఐ బృందం పెదపులివర్రు, చింతమోటు గ్రామాలలో పరిశీలించింది. కార్యక్రమంలో సీపీఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బి. శ్రీనివాసరావు, ఎఐటీయుసీ నాయకులు వి. శ్రీనివాసరావు, రైతులు కె. సతీష్, కె. శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



'దారి'కాచిన కష్టాలపై స్పందన



దోకిపర్రులో రోడ్డుపై ఉన్న బురదను పొక్లెయిన్ సాయంతో తొలగిస్తున్న దృశ్యం



సాక్షి స్పందన

మేడికొండూరు/ఫిరంగిపురం: వరదకు దెబ్బతిన్న రోడ్ల దుస్థితిపై మంగళవారం సాక్షి దినపత్రికలో 'దారి'కాచిన కష్టాలు శీర్షికన ప్రచురితమైన ఫొటో ఫీచర్‌కు అధికారులు స్పందించారు. మేడికొండూరు మండలం డోకిపర్రు రోడ్డుపై నిలిచిన మురుగు, బురదను పొక్లెయిన్ సాయంతో తొలగించి శుభ్రం చేశారు. అలాగే ఫిరంగిపురం మండలం కండ్రిక వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతినడం, నుదురుపాడు అడ్డరోడ్డు వద్ద బురదమయంగా మారడంపై పంచాయతీ రాజ్ పర్యవేక్షక ఇంజినీర్ జి.బ్రహ్మయ్య స్పందించారు. ఈ రోడ్డును అభివృద్ధి చేసేందుకు ఎస్డీఆర్ఎఫ్ గ్రాంటు నుంచి రూ.4లక్షలు మంజూరయ్యాయని, మరో రూ.40 లక్షల గ్రాంటు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామని పేర్కొన్నారు. మేడికొండూరు మండలం డోకిపర్రు, తురకపాలెం, మంగళగిరిపాడు మీదుగా మేడికొండూరు వెళ్లే రహదారి అభివృద్ధికోసం రూ.కోటి ఎఫ్‌డీఆర్ గ్రాంటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వివరించారు. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ప్రేమ పేరుతో మోసం

తెనాలిరూరల్: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన యువతి ఇంటర్ పరీక్షలు రాసే సందర్భంలో అదే పరీక్ష హాలులో తన వెనుక బెంచీలో పరీక్ష రాస్తున్న తెనాలి నాజరుపేటకు చెందిన నాగ వెంకట యశ్వంత్ పరిచయమయ్యాడు. పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ గుంటూరు పెదపలకలూరులోని డిగ్రీ కళాశాలలో ఫస్టియర్ చదువుతున్నారు. ప్రేమ పేరుతో శారీరకంగానూ దగ్గరయ్యాడని, ఇప్పుడు పెళ్లికి నిరాకరించాడంటూ యువతి తెనాలి పోలీసులను మంగళవారం రాత్రి ఆశ్రయించింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

రేపల్లెరూరల్: పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఘటన మైనేనివారిపాలెంలో మంగళవారం జరిగింది. కృష్ణానది ఒడ్డున దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. దాడుల్లో పేకాట ఆడుతున్న ముగురిని అదుపులోకి తీసుకుని, వీరి వద్ద నుంచి రూ.5,300 నగదును స్వాధీనం చేసుకున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com